ట్రిపుల్‌ఐటీకి ఇద్దరు విద్యార్థుల ఎంపిక


మనిదీప్ తివారీ


బుక్య నితిన్

కూకట్‌పల్లి: ఇటీవల విడుదలైన ట్రిపుల్ ఐటీ బాసర ప్రవేశానికి కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మనిదీప్ తివారీ, బుక్య నితిన్ ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు నరేందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన ఈ ఇద్దరు విద్యార్థులు పదో తరగతి 2023–24లో మంచి ప్రతిభ చాటి 9.8, 9.7 జీపీఏ సాధించి పాఠశాల టాపర్‌లుగా నిలిచారని తెలిపారు. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ బాసరలో జీపీఏ ఆధారంగా ఎంపిక చేసే ట్రిపుల్ ఐటీ కోర్సుకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావటం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ గణిత ఉపాధ్యాయులు పర్మగళ్ల నర్సిములు విద్యార్థులను అభినందించి భవిష్యత్‌లో ఉన్నత విద్యలో కూడా రాణించి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఎల్లమ్మ చెరువులో గుర్రపుడెక్కను తొలగించాలి


ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటిన రవికుమార్ యాదవ్, బీజేపీ నాయకులు


ఎల్లమ్మ చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను పరిశీలిస్తున్న రవికుమార్ యాదవ్

ఆల్విన్‌కాలనీ: డా.శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకల్లో భాగంగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ శంషీగూడలోని ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ఎల్లమ్మ చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చుట్టు పక్కల కాలనీల డ్రైనేజీ చెరువులో కలవటంతో విపరీతమైన దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోందన్నారు. చెరువు చుట్టు పక్కల కాలనీల ప్రజలు దోమలు వృద్ధి చెందడంతో జ్వరాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. నిలిచిపో[illegible] తీసుకెళ్లి పరిష్కారం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మహంకాళీ నగర్‌లో కాలనీ రోడ్డుకు నిధులు మంజూరైనా ఇంత వరకు పూర్తి చేయలేదన్నారు. సమస్యలను కాలనీవాసులు మా దృష్టికి తీసుకొస్తున్నారని ప్రజా సమస్యలపై పోరాడటానికి బీజేపీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. సమస్యలను వీలైనంత త్వరలో సంబంధిత అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, రామరాజు, మణిభూషణ్, నరేందర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, నర్సింగ్‌యాదవ్, నరసింహాచారి, స్రవంతి, అరుణ్‌కుమార్, కేశవులు, నర్సింగ్‌రావు, భూపాల్‌రెడ్డి, రఘు, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శంకరమఠంలో కోటి కుంకుమార్చన

మోతీనగర్: మోతీనగర్‌లోని శంకరమఠంలో 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కోటి కుంకుమార్చన, 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకు నిట్టల కిరణ్మయిచే శ్రీ దేవిభాగవత నవాహ్నిక జ్ఞానయజ్ఞ మహోత్సవం కార్యక్రమం ఉంటుందని మఠం నిర్వాహకులు సీఎస్ఆర్ మూర్తి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. అదే విధంగా 17వ తేదీ ఉదయం 9గంటలకు శ్రీలలితా హోమం, 11గంటలకు లక్ష కుంకుమార్చన, మధ్యాహ్నం 12.30గంటలకు నీరాజన, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మెల్యేకు మక్కా చిత్రపటం బహూకరణ



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్ ఇటీవల 41 రోజుల పాటు హజ్‌యాత్రలో ఉండి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హజ్‌యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకొని శుక్రవారం నగరానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కృష్ణారావును కలిసి మక్కా నమూనా చిత్రపటాన్ని అందజేశారు.

కనక దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు, హోమ పూజలో మక్కాల సత్యనారాయణ

ఓల్డ్‌బోయిన్‌పల్లి: అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లి రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయంలో హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి అమావాస్యకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని మార్కెట్ చైర్మన్ మక్కాల సత్యనారాయణ తెలిపారు. పూజలో వైస్‌చైర్మన్ రమేష్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్, కార్యదర్శి నర్సింగ్‌రావు, నాయకులు మట్టి శ్రీను, రాజుగౌడ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఏలకు తగిన న్యాయం చేస్తా

బాలానగర్: మూసాపేట ఏఎంహెచ్‌ఓ సాల్మన్ రాజు వేధింపులపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఏలు శుక్రవారం కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నా తమను వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎస్ఎఫ్ఏలకు తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

కార్మికులకు ఐఎన్‌టీయూసీ ఎంతో నష్టం చేసింది

కుత్బుల్లాపూర్: గతంలో ఐఎన్‌టీయూసీ సంఘం చేసిన అగ్రిమెంట్ ద్వారా కార్మికులు తీవ్రంగా నష్టపోయారని టీఆర్ఎస్‌కేవీ యూనియన్ అధ్యక్షుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. బాలనగర్ ఇండస్ట్రీ ఏరియాలోని బయో కెమికల్ సింథటిక్ ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గురువారం సాయంత్రం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మదన్‌గౌడ్ మాట్లాడుతూ... గతంలో తాము రెండు అగ్రిమెంట్లు చేసి లీవ్‌లను పెంచి 23 మంది కార్మికులను పర్మనెంట్ చేసి రూ.6,100 పెంచామన్నారు. కానీ ఐఎన్‌టీయూసీ సంఘం రూ.4,700 అగ్రిమెంట్ చేసి రూ.1400 కార్మికులు నష్టపోయే విధంగా చేసిందన్నారు. 6వ తేదీన జరిగే ఎన్నికల్లో సింహం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలన్నారు. – మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్ మాట్లాడుతూ.. కార్మికులకు ఐఎన్‌టీయూసీ ఎంతో నష్టం చేసిందన్నారు. మదన్‌గౌడ్‌ను గెలిపిస్తే కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు రామారావు, మల్లేష్, కె.సుభాష్, కె.రాంబాబు, సుమిత్, మోహన్ పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి ఓటర్లకు రుణపడి ఉంటా

పట్నం సునీతామహేందర్‌రెడ్డి

కూకట్‌పల్లి: పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం తమ కుటుంబం పనిచేస్తుందని సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు పట్నం సునీతామహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి ఓటర్లకు రుణపడి ఉంటామని అన్నారు. వికారాబాద్ జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్‌గా పదవీ విరమణ చేసిన సందర్భంగా శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్నం సునీతామహేందర్‌రెడ్డిని సన్మానించారు. ఆమె రాజకీయ పనితీరు, చేసిన సేవా, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కూడిన అంశాలతో రూపొందించిన సన్మాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, దిండి అరవింద్‌రెడ్డి, సంజీవరావు, మేకల మైకేల్, చిన్న పాషా తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు దోమ కాటుతో వ్యాపించే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే తొలగించాలన్నారు. నీరు నిల్వ ఉండే చోట దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రై డే'గా పాటించాలన్నారు. ప్రతి ఇంటికి యాంటీ లార్వ ఆపరేషన్ చేసే ఎంటమాలజీ సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూకట్‌పల్లి డీఎంఈ జంబన్నకు ప్రశంసా పత్రం

మూసాపేట: కూకట్‌పల్లి డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ (డీఎంఈ) జంబన్నకు ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగాధిపతి శ్రీధర్ శుక్రవారం ప్రశంసా పత్రాన్ని అందజేశారు. జూన్‌మాసంలో కార్పొరేట్ బల్క్ బుకింగ్‌లో భాగంగా ప్రైవేట్ లిమిటెడ్‌తో రూ.9లక్షల బిజినెస్ చేసినందుకు జంబన్నని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ డిప్యూటి సిటిఎం (ఎల్) జిహెచ్‌జెడ్, ఏటీఎం జీహెచ్‌జెడ్ వెంకటనారాయణ, ఐఈసీబీఎం ప్రొఫెసర్లు, కార్పొరేట్ బల్క్ బిజినెస్ ఇన్‌చార్జి ప్రవీణ్ భాను, సికింద్రాబాద్ ఆర్‌ఎంఈ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాంరెడ్డినగర్‌ను అభివృద్ధి చేసే బాధ్యత నాదే..

మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

జీడిమెట్ల: రాంరెడ్డినగర్ కాలనీని అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని మాజీ కార్పొరేటర్ బీఆర్ఎస్ నాయకులు గుడిమెట్ల సురేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కాలనీలోని వీధుల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు కాలనీలో ఉన్న సమస్యలను సురేష్‌రెడ్డికి వివరించారు. ఇప్పటికే కాలనీలో చాలా వరకు అభివృద్ధి పనులు చేశానని మిగిలిన పనులను త్వరలోనే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

పనుల ప్రారంభోత్సవానికి మంత్రికి ఆహ్వానం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ శుక్రవారం మంత్రి డి. శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన మంత్రితో చర్చించారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.10కోట్లతో చేపట్టే పనుల ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఈనెల 10 తర్వాత మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొనున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం



మోతీనగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరం లాంటిదని కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్‌కు చెందిన ఫాతిమా బేగంకు లక్ష రూపాయల ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే కృష్ణారావు బాధిత కుటుంబ సభ్యుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా ఎంతో మందిని ఆదుకున్నారని అన్నారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.